పత్రికాప్రకటన కాకినాడ, 25.10.2018

ఈ నెల 26వ తేదీ నుండి నవంబరు 11వ తేదీ వరకూ కాకినాడలో నిర్వహిస్తున్న జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన-2018ను నగర, జిల్లా ప్రజలు ఆదరించి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖజాయింట్ డైరక్టర్ మైసూరి నాగేశ్వరరావు కోరారు.

గురువారం ఉదయం స్థానిక మెయిన్‌రోడ్‌లో గల ఎస్ఆర్ఎంటి ఫంక్షన్ హాలు-1లో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ జాయింట్ డైరక్టర్లు మైసూరి నాగేశ్వరరావు, జవహర్ బాషా, అసిస్టెండ్ డైరక్టర్ పి.సత్యన్నారాయణలు మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తమ శాఖ ఆధ్వర్యంలో దీపావళి, సంక్రాంతి పండుల సందర్భంగా ఈ నెల 26 నుండి నవంబరు 11వ తేదీ వరకూ కాకినాడ లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ చేనేత వస్త్రకళా ప్రదర్శన-2018 గురించి వివరించారు. కాకినాడ మెయిన్‌రోడ్‌లోని రాయల్ పార్క్ హొటల్ ప్రక్కన గల ఎస్.ఆర్.ఎం.టి ఫంక్షన్ హాలు-1 వేదికగా నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి ప్రదర్శనను రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమం, సాధికారత, చేనేత జౌళి శాఖల మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉదయం 11 గం.లకు లాఛనంగా ప్రారంభిస్తారని జెడి నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి నవంబరు 11వ తేదీ వరకూ 17 రోజుల పాటు ఉదయం 11 గం.ల నుండి రాత్రి 9 గం.ల వరకూ ఈ ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని, వివిధ రాష్ట్రాల నుండి పాల్గొంటున్న చేనేత కళాకారులు, ఉత్పత్తి సంఘాలు మొత్తం 85 స్టాళ్లలో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళాకారులు 56, తెలంగాణ నుండి 11, తమిళనాడు నుండి 7, పశ్చిమ బెంగాల్ నుండి 6, ఉత్తర్‌ప్రదేశ్ నుండి 7, మధ్యప్రదేశ్ నుండి 3 చొప్పున తమతమ రాష్ట్రాలలో పేరుపొందిన చేనేత, పట్టు వస్త్రాలు పర్నిషింగ్, తివాచీలు, డ్రస్ మెటీరియల్ ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారని తెలియజేశారు. ప్రదర్శనకు వచ్చే సందర్శకులకు ఉల్లాసం కల్పించేందుకు ప్రదర్శన ప్రాంగణంలో ప్రతి రోజూ సాయంత్రం 6 గం.ల నుండి శాస్త్రీయ, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ, మేజిక్, వెంట్రిలోక్విజం షోలు నిర్వహిస్తున్నామని, ఈనెల 28వ తేదీ ఆదివారం సాయంత్రం చేనేత ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసామన్నారు. గత సంవత్సరం కాకినాడలో ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శనను నగర, జిల్లా ప్రజలు విశేషంగా ఆదరించి సుమారు 4 కోట్ల చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసారని, ఈ సంవత్సరం మరో 6 కోట్లు చేనేత విక్రయాలు జరుపాలని లక్ష్యం చేపట్టామన్నారు. దళారులు, మధ్యవర్తులు లేకుండా చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రజాదరణ కల్పించాలనే లక్ష్యంగా ఉత్పత్తి ధరకే నేరుగా ఈ ప్రదర్శనలో విక్రయించడం జరుగుతుందన్నారు. అలాగే చేనేత ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం రిబేటు ప్రకటించిందన్నారు. చేనేత ఎక్స్‌పో-2018 ను నగర, జిల్లా ప్రజలు ఆదరించి, చేనేత కళను, కార్మికులను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా జెడి నాగేశ్వరావు, జవహర్ బాషాలు విజ్ఞప్తి చేశారు.

(సమాచార శాఖచే జారీ)